సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



విద్యార్థులకు మేలు

లింగ్వా స్కిల్ కేంద్రంతో విద్యార్థులకు నైపుణ్యం, ఉపాధి ఉద్యోగాలు లభిస్తాయని ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. 8లో▸



ఎండకు తాళలేక..

హైదరాబాద్–బీజాపూర్ ప్రధాన రహదారిపై బస్టాప్‌లకు షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండలకు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



అప్రమత్తతతోనే అడ్డుకట్ట

వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలు కోల్పోయే ఆస్కారం ఉంది. 8లో▸

చేసేదే చెబుతా | చెప్పింది చేస్తా



'నేనేమీ ఆస్తులు కూడబెట్టేందుకో.. అధికారాన్ని అనుభవించేందుకో.. రాజకీయాల్లోకి రాలేదు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు, చేవెళ్ల ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. ఎన్నికల్లో గెలుపు కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇవ్వను. కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా ఝూటా మాటలు చెప్పను. నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోలేను. ఏది ఆచరణ సాధ్యమో ఆయా అంశాలపై మాత్రమే హామీలు ఇస్తాను. బీజేపీ సిద్ధాంతాలను, మోదీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తా. మోదీ బొమ్మను చూపించి ఆశీర్వదించాల్సిందిగా అభ్యర్థిస్తా. ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఇటీవలే ప్రజల్లోకి వెళ్లాను. నామినేషన్ తర్వాత ప్రచారాన్ని మరింత ముమ్మరం చేస్తా. చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, ఇతర పార్టీ పెద్దలతో రోడ్ షోకు ప్లాన్ చేస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్‌ఎస్ సంస్థాగతంగా బలహీనపడింది. కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ ఉండబోతోంది' అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

– సాక్షి, రంగారెడ్డిజిల్లా

ఝూటా మాటలు చెప్పను

- వ్యక్తిత్వాన్ని దెబ్బతీసుకోను
- కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ
- అడ్డగోలు హామీలు ఇవ్వను
- తుదిశ్వాస వరకూ మోదీతోనే..
- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రచారం ఎలా కొనసాగుతోంది. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

కొండా: ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఇప్పటికే 370 గ్రామాల్లో పర్యటించా. ఆయా గ్రామాల్లో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అర్బన్ ఏరియాల్లోనే కాకుండా రూరల్ ప్రాంతాల్లోనూ బీజేపీ గాలి వీస్తోంది. ప్రజలకు మోదీ ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. మోదీ విధానాలు నచ్చి ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు 3 వేల మందికి పైగా బీజేపీలో చేరారు.

ఏ పార్టీ నుంచి ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు?

కొండా: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత సంస్థాగతంగా బలహీనంగా మారింది. ఆ పార్టీ అభ్యర్థికి ముదిరాజ్ సమాజంలో మంచి గుర్తింపు ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి చేస్తున్న చిల్లర కామెంట్లు మళ్లీ అ పార్టీ గ్రాఫ్‌ను పెంచుతున్నాయి. ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్‌తోనే ప్రధానంగా పోటీ ఉండబోతోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాదు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ మోదీ వేవ్ కొనసాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థిలా ఝూటా మాటలు నేను మాట్లాడను. అమలు సాధ్యం కానీ హామీలు ఇవ్వను. కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయను. రాజకీయాల్లో ఉన్నంత కాలం నిజాయితీగా నిబద్ధతతో పని చేస్తా.

మైనార్టీల ఓట్లు మీకు పడే అవకాశం ఉందంటారా?

కొండా: కాంగ్రెస్ అభ్యర్థి పూర్తిగా ముస్లిం మైనార్టీ ఓట్లపైనే ఆధారపడుతున్నారు. ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లు ఆరు లక్షల వరకు ఉంటారు. బీజేపీ ఆయా వర్గాలకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. త్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళల్లో మోదీపై గౌరవం పెరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లోని మెజార్టీ క్రిస్టియన్లు బీజేపీతోనే ఉన్నారు. మాపై మతతత్వ ముద్ర వేసి..వాళ్లు మాత్రం మతం పేరుతో గెలుపొందాలనుకుంటున్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ అవసరానికి ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టొద్దు. ఇది దేశానికి మంచిది కాదు.

తరచూ పార్టీలు మారతారనే అపవాదు మీపై ఉంది. దీనికి మీ సమాధానం?

కొండా: పైరవీల కోసమో, ఆస్తులు కూడబెట్టేందుకో? నేను రాజకీయాల్లోకి రాలేదు. చేవెళ్ల ప్రజలకు మంచి చేయాలనే ఏకైక లక్ష్యంతోనే వచ్చాను. మొదట్లో బీఆర్‌ఎస్ విధానాలు నచ్చి ఆ పార్టీలో చేరాను. ఏ నినాదం పేరుతో అధికారంలోకి వచ్చిందో.. ఆ తర్వాత వాటిని మర్చిపోయింది. పార్టీ అధినేత వైఖరిలోనూ మార్పు వచ్చింది. తెలంగాణ ప్రజలకు మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతుండటం, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌కు బలమైన పార్టీ కాంగ్రెస్ అని భావించి, ఆ పార్టీలో చేరాను. కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్‌కు అమ్ముడుపోయింది. దీంతో నేను మరో ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సి వచ్చింది. మోదీ విధానాలు.. దేశ అంతర్గత భద్రత, అభివృద్ధి కోసం ఆయన పడుతున్న తపనకు ఫిదా అయ్యాను. బీజేపీలో చేరాను. చివరి శ్వాస వరకు ఇదే పార్టీలో కొనసాగుతా.

111 జీఓ, కందిబోర్డు, జీఎస్టీ రద్దు, శాటిలైట్ సిటీ సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?

కొండా: నేను ఎంపీగా ఉన్నప్పుడే రూ.930 కోట్లతో బీజాపూర్ రోడ్డును మంజూరు చేయించా. రాజకీయ, రియల్ ఎస్టేట్ అవసరాల కోసం ఈ పనులను అడ్డుకున్నారు. కందిబోర్డు ఏర్పాటు కన్నా.. రైతులు పండించిన కందులకు మద్దతు ధర కల్పన, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పిస్తా. వికారాబాద్‌లో శాటిలైట్ సిటీ ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రానికి లేఖ రాశాను. కనెక్టివిటీ కోసం ఇప్పటికే మన్నెగూడ రోడ్డును మంజూరు చేయించాను. ఎంపీగా గెలుపొందిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు, శాటిలైట్ సిటీ ఏర్పాటు పనులు పూర్తి చేయిస్తా. హైదరాబాద్– ముంబై బుల్లెట్ ట్రైన్ సర్వే మొదలైంది. వికారాబాద్ తొలి స్టాప్ ఏర్పాటు చేశారు. ఎంఎంటీఎస్ మంజూరు చేయిస్తే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధుల లేమితో చేతులెత్తేసింది. తాండూరులోని నాపరాతి పరిశ్రమకు జీఎస్టీ 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించా. నాపరాయి వ్యర్థాలతో వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తా. 111 జీఓ రద్దు కోసం తొలి లేఖ రాశాను. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ జీఓను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, దాని స్థానంలో ఉల్టాపల్టా జీవో 69 తీసుకొచ్చింది.

అపాయింట్‌మెంట్ లేనిదే ఎవరినీ కలవరనే అపవాదు ఉంది. దీనికి మీ సమాధానం?

కొండా: అపాయింట్‌మెంట్ తీసుకుని రావాలనే ప్రచారం తప్పు. నిత్యం ప్రజల మధ్యే ఉంటాను. ఎవరూ వచ్చినా కలుస్తాను. ఆపదలో వచ్చిన వారికి అండగా నిలుస్తున్నా. కోవిడ్ సమయంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశాను. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్యులు సైతం నేరుగా వచ్చి కలవొచ్చు. చేవెళ్ల అభివృద్ధే లక్ష్యంగా నామినేషన్ రోజు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేస్తా.

నామినేషన్లకు నాంది

చేవెళ్లలో 3, మల్కాజిగిరిలో 9 ..

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం మొదలైంది. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పలువురు అభ్యర్థులు ఆయా రిటర్నింగ్ కేంద్రాల్లో తమ నామినేషన్లు సమర్పించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో 9, చేవెళ్ల స్థానానికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్ సభ స్థానాల్లో తొలి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బి.వెంకట్ రమేష్ బాబు, స్వతంత్ర అభ్యర్థిగా మహమ్మద్ ముస్తాఫా రిజ్వాన్, ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థిగా పాలమాకుల మధు ఒక్కో సెట్ చొప్పున రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి శశాంక ఆయా అభ్యర్థులతో ప్రమాణం చేయించారు. ఇక మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో తొలి రోజు ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన సతీమణి ఈటల జమున మరో నామినేషన్ దాఖలు చేశారు. అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా మేడే సత్యం, స్వతంత్ర అభ్యర్థులుగా పాలది పవన్ కుమార్, బేగరి లోకేష్, చిలకా చంద్రశేఖర్, మాలోతు శంకర్ నామినేషన్, పెసరికాయల పరీక్షిత్తురెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సికింద్రాబాద్ స్థానానికి తొలిరోజు నామినేషన్ దాఖలు కాలేదు.



చేవెళ్ల నుంచి నామినేషన్ వేస్తున్న సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి వెంకట్ రమేష్‌బాబు

భువనగిరి నుంచి మొదటి రోజు ముగ్గురు

సాక్షి, యాదాద్రి: మొదటి రోజు భువనగిరి లోక్ సభ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇందులో ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్లు, ఇండిపెండెంట్లు భేతి నరేందర్, మర్రిస్వామి ఒక్కో సెట్ చొప్పున దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ), కలెక్టర్ హనుమంతు కే.జెండగే నామినేషన్లు స్వీకరించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



తలకొండపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

తలకొండపల్లి: ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందజేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం ఎరువుల దుకాణాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరల పట్టిక, బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్ మెషీన్ పనితీరు, విక్రయాలు, ధరల వివరాలను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత కలిగిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. గడువు ముగిసిన సరుకును విక్రయించొద్దన్నారు. డీఏపీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు పాటించని దుకాణ యజమానులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏవో రాజు, ఏఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జిగా 'చింపుల'



చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేవెళ్ల లోక్‌సభ అబ్జర్వర్ వేంనరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ చింపుల సత్యనారాయణరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సీఎం రేవంత్‌రెడ్డి, చేవెళ్ల లోక్‌సభ అబ్జర్వర్ వేంనరేందర్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను సమర్థవంతగా నిర్వర్తిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేస్తానని చెప్పారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి



గుర్రంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కొందుర్గు: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి సూచించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతో పాటు గుర్రంపల్లి పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ ఎస్‌ఐలు కృష్ణయ్య, సక్రమ్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలుశిక్ష

ఆమనగల్లు: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జిల్లా జువైనల్ కోర్టు జడ్జి జైలుశిక్ష, జరిమానా విధించారు. రాంనుంతల గ్రామ పరిధిలోని పెద్ద తండాకు చెందిన బాలికను 2018లో అదే తండాకు చెందిన బాలుడు అరుణ్‌కుమార్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దీనిపై జిల్లా జువైనల్ కోర్టు జడ్జి నిందితుడైన అరుణ్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.4 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి అప్పటి సీఐ వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఎస్ఐ బాల్‌రాంనాయక్, కోర్టు కానిస్టేబుల్ శివశంకర్ సాక్షులను త్వరితగతిన కోర్టుకు హాజరుపరిచి నిందితుడికి జైలుశిక్ష పడేలా చూడటంపై షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అభినందించారు.

రికార్డు బ్రేక్

- గ్రేటర్‌లో 4,053 మెగావాట్ల విద్యుత్ డిమాండ్
- 2023 మే 19న 3,756 మెగావాట్లు
- 2024 ఏప్రిల్ 1న 3,832 మెగావాట్లు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో గురువారం రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదైంది. గతంలో నమోదైన రికార్డులను బ్రేక్ చేస్తూ గురువారం ఏకంగా 4,053 మెగావాట్లు నమోదు కావడం విశేషం. 2023 మే 19న అత్యధికంగా 3,756 మెగా వాట్లు నమోదు కాగా, అదే 2024 ఏప్రిల్ 1న 3,832 మెగా వాట్లు నమోదైంది. డిస్కం చరిత్రలో ఈ స్థాయిలో విద్యుత్ వినియోగం జరగడం ఇదే తొలిసారి. గతంలో ఉన్నడూ లేని విధంగా విద్యుత్ వినియోగం నమోదువుతుండటంతో ఇంజినీర్లు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఒత్తిడికి లోనవుతున్న సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లను గుర్తించి, ఆ మేరకు వాటి సామర్థ్యాన్ని పెంచారు. అధిక లోడు నమోదువుతున్న ఫీడర్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్న సిబ్బందిని ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఎక్స్ వేదికగా అభినందించారు.

గుడ్ బై ఆల్ మై ఫ్రెండ్స్

- నన్ను కాపాడే ప్రయత్నం చేయొద్దు
- సెల్ఫీ వీడియో తీసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం
- కూల్ డ్రింక్‌లో పురుగు మందు కలుపుకొని తాగిన వైనం
- వైరల్‌గా మారిన వీడియో



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాజు

కొందుర్గు: కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వీడియో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. టేకులపల్లికి చెందిన బుడ్డనోళ్ల రాజు (22).. తాను షాద్‌నగర్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాని.. ఎవరూ కాపాడే ప్రయత్నం చేయొద్దని, గుడ్ బాయ్ ఆల్ మై ఫ్రెండ్స్.. అని సెల్ఫీ వీడియో తీసుకుని కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలుపుకొని తాగాడు. అదే విధంగా తన తండ్రి జంగయ్యను ఉద్దేశించి నాన్న మీరు బాగుండాలి.. తాగుడు మానేయాలి.. అమ్మను బాగా చూసుకో అంటూ మరో వీడియో పోస్టు చేశాడు. తనను ఎందుకూ పనికిరావు అంటూ పదేపదే అనడంతో మనస్తాపానికి గురయ్యానని వివరించాడు. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం రాజు బైక్ నడుపుతూ ఓ వ్యక్తికి యాక్సిడెంట్ చేసినట్లు తెలిసింది. ఈ సమయంలో పరిహారం చెల్లించేందుకు తల్లిదండ్రులకు తెలియకుండా అప్పు చేసినట్లు సమాచారం. ఈ విషయమై రెండురోజులుగా ఇంట్లో గొడవ జరిగిందని.. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఇంటర్ చదివిన రాజు ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. ఒక్కగానొక్క కొడుకు ఎక్కడున్నాడో.. ఏ పరిస్థితిలో ఉన్నాడో తెలియక తల్లి పద్మమ్మ, తండ్రి జంగయ్య గుండెలు బాదుకున్నారు. ఈ విషయమై పోలీసులను అడగగా.. రాజు ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, అతడి ఆచూకీ తెలియడం లేదని చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు

మొయినాబాద్: కలియుగదైవం చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట సెల్వార్ కూత్తు నిర్వహించి.. వేద మంత్రోశ్చరణతో దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పుట్ట బంగారం (పుట్ట మన్ను) తీసుకొచ్చి హోమగుండాలు ఏర్పాటు చేశారు. అందులో నవధాన్యాలు, పాలికలు కలిపి హోమాలను వెలిగించారు. తరువాత విష్వక్సేనుడి ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞం చేపట్టారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పూజా కార్యక్రమాలు తిరుమల కిరణాచారి, పరావస్తు రమాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందర రాజన్, కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, కిట్టు, కన్నయ్య, అనిల్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

నేడు గరుడ ప్రసాదం వితరణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు ధ్వజారోహణం, శేషవాహనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా గరుత్మంతునికి సమర్పించే నైవేద్యాన్ని సంతానం లేని మహిళలకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. గరుడ ప్రసాదంకోసం అధిక సంఖ్యలో మహిళలు వచ్చే అవకాశం ఉండటంతో తగిన ఏర్పాట్లు చేశారు.



కాసాని జ్ఞానేశ్వర్, క్యామ మల్లేశ్‌కు బీఫాంలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీ ఫాంలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం ఆ పార్టీ కార్యాలయంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు బీఫాం అందజేశారు. ఆయన వెంట మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు ఉన్నారు.

భువనగిరి ఎంపీ అభ్యర్థికి..

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం పార్టీ బీఫాంను అందజేశారు. అలాగే ఎన్నికల ఖర్చుల నిమిత్తం రూ.98 లక్షల చెక్కును అందించారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ బాగుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లింగ్వా స్కిల్'తో విద్యార్థులకు మేలు

రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఉన్నత విద్యా కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్

మొయినాబాద్‌రూరల్: లింగ్వా స్కిల్ కేంద్రంతో విద్యార్థులకు నైపుణ్యం, ఉపాధి ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని జేబీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆవరణలో అసిస్‌మెంట్ లింగ్వా స్కిల్ పరీక్షా కేంద్రాన్ని కళాశాల కార్యదర్శి జేవీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ లింగ్వా స్కిల్ పరీక్షా కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీరామ్‌వెంకటేశ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా లింగ్వా స్కిల్ పరీక్షా కేంద్రం జేబీ గ్రూప్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లింగ్వా స్కిల్ అనేది నాలుగు భాషా నైపుణ్యాలతో వేగవంతమైన పరీక్షతో ఇంగ్లిష్ సామర్థ్యం అందిస్తుందన్నారు. ఉద్యోగులు, వ్యాపార భాష గురించి తెలిసిన సంస్థల్లో నియామకానికి అత్యంత అనుకూలమైందని సూచించారు. లింగ్వా స్కిల్‌లో లక్ష్యాల ఆధారంగా పరీక్షించబడే భాషను ఎంచుకునే సామర్థ్యాన్ని మీకు అందిస్తుందన్నారు. ఈ లింగ్వా స్కిల్ జనరల్ రోజు వారి జీవితంలో ఉపయోగించే భాషను పరీక్షిస్తుందని చెప్పారు. జేబీ ఈఎస్ కేంబ్రిడ్జి నుంచి భాషా నైపుణ్యాన్ని నిర్వహించడానికి అధికారం ఉంటుందన్నారు. అనంతరం భాస్కర ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జేవీ కృష్ణారావు మాట్లాడుతూ.. జేబీ గ్రూప్ విద్యాసంస్థను వ్యవస్థాపక చైర్మన్ దివంగత జె.భాస్కర్‌రావు 1993లో స్థాపించారని తెలిపారు. జేబీఐఈటీ 1998 యూజీసీ అటానామస్‌లో భాస్కర ఇంజనీరింగ్ కళాశాల, భాస్కర ఫార్మసీ, 2007లో భాస్కర లా కాలేజ్, 2008లో జేవీ కృష్ణారావు అభ్యాస ప్రక్రియకు సృజనాత్మక విధానాన్ని అవలంబించడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ సమావేశంలో కంట్రీ హెడ్ సౌత్ ఏసియా కేంబ్రిడ్జి ఇంగ్లిష్ అసిస్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపక డైరెక్టర్ పీకే అరుణాచలం, జేబీ ఈసీ డైరెక్టర్ సంజయ్, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, సుమగ్న పటాన్ణయక్, యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న జిలెటిన్‌స్టిక్స్

షాద్‌నగర్‌రూరల్: అనుమతులు లేకుండా బండరాళ్లు పగులగొడుతున్న వ్యక్తి నుంచి షాద్‌నగర్ పోలీసులు గురువారం పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రతాప్‌లింగం తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల శివారులో గురువారం కొందరు అనుమతులు లేకుండా జిలెటెన్ స్టిక్స్ సాయంతో బండరాళ్లను పగలగొడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న డీఐ రామిరెడ్డి, కానిస్టేబుల్స్ సలీం, రాజు, యాదగిరి అక్కడికి వెళ్లి విచారించారు. అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న చింతగూడ గ్రామానికి చెందిన వంగూరి యాదయ్యను అరెస్టు చేసినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌కు చెందిన యాదయ్య, భవానీ పరారీలో ఉన్నట్లు సీఐ తెలి పారు. నిందితుడి నుంచి 59 జిలెటిన్‌స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక..

కుమార్తె ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కుమార్తె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయ్‌నగర్ కాలనీ, ప్రేమ్ సరోవర్ అపార్ట్‌మెంట్స్‌లో శ్రీదేవి తన కుమార్తె వైష్ణవి(20)తో కలిసి నివాసం ఉంటోంది. భర్త సూర్యారావు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. వైష్ణవి బీటెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. తండ్రి లేని జీవితం తనకు అక్కర్లేదని, తాను చనిపోతానని పలుమార్లు తల్లితో చెప్పింది. ఈ నెల 17న తల్లి శ్రీదేవి బయటికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న వైష్ణవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 'ఐ యామ్ సారీ.. నాకు నాన్న కావాలి'అని సూసైడ్ నోట్ పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉంది.

కుమారుడితో కలిసి గృహిణి అదృశ్యం



కవిత(ఫైల్)

పహాడీషరీఫ్: కుమారుడితో కలిసి గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ప్రహ్లాద్ ప్రమణి, కవిత ప్రమణి (23) దంపతులు తమ కుమారుడు కమ్లాకాంత్‌తో కలిసి శ్రీరాం కాలనీకి నాలుగేళ్ల క్రితం వలస వచ్చారు. ఈ నెల 17న ప్రహ్లాద్ డ్యూటీకి వెళ్లి వచ్చే వరకు తన భార్య, కుమారుడు కనిపించలేదు. పొరుగింట్లో ఉండే రోహిత్‌పై అనుమానం ఉందంటూ పోలీస్‌స్టేషన్‌లో గురు వారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అమ్డాపూర్ చౌరస్తాలో రోడ్డుపై విద్యార్థుల నిరీక్షణ



జేబీఐటీ కళాశాల ఎదుట వేచియున్న ప్రయాణికులు, విద్యార్థులు

ఎండకు తాళలేక.. నిలువ నీడలేక



అజీజ్‌నగర్ చౌరస్తాలో విద్యార్థినుల పడిగాపులు

ఓ వైపు ఎండలు దంచి కొడుతున్నాయి. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- రోడ్లపైనే ప్రయాణికుల పడిగాపులు
- బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు

మొయినాబాద్‌రూరల్: ఎండలు రోజు రోజుకు ముదురుతున్నాయి. హైదరాబాద్-బీజాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న పోలీస్ అకాడమీ అప్పా జంక్షన్ మొదలుకుని తోల్‌కట్ట బస్టాప్ వరకు ఆయా గ్రామాల్లో బస్టాప్‌లుంటాయి.. కానీ షెల్టర్లుండవు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులుకాస్తున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అమ్డాపూర్ చౌరస్తా, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట ఆయా గ్రామాల చౌరస్తాలలోని బస్టాప్‌లలో బస్ షెల్టర్లు కరువయ్యాయి. మండల పరిధిలో ఇంజనీరింగ్, మెడికల్, డెంటల్ కళాశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. జంట నగరాలనుంచి రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు రోడ్లపై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు, ప్రైవేటు సంస్థలు స్వచ్ఛందంగా పరిశీలించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

షెల్టర్లు ఏర్పాటు చేయండి



మండల కేంద్రంలోని ఆయా గ్రామాల చౌరస్తాల్లో బస్టాప్‌లున్న చోట షెల్టర్లు ఏర్పాటు చేయాలి. ఎండలు మండుతుండడంతో నీడ లేక ప్రయాణికులు అల్లాడుతున్నారు. రోడ్లపైనే నిలుచుంటున్నారు. – గడ్డం వెంకట్‌రెడ్డి, సురంగల్

రోడ్లపైనే నిరీక్షణ



బస్టాప్‌లలో షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అమ్డాపూర్ గ్రామాలతో పాటు మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట బస్టాప్‌లలో షెల్టర్లు లేక రోడ్లపై వేచియుంటున్నారు. ప్రభుత్వం షెల్టర్లు ఏర్పాటు చేయాలి. – కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం

కిడ్నాప్ కేసులో తహసీల్దార్ ప్రమేయం

- ముఠాతో సంబంధం ఉన్నట్లు గుర్తింపు
- అరెస్ట్‌కు రంగం సిద్ధం చేసిన పోలీసులు
- పాతకేసును వైరల్ చేస్తున్నారు: ఏసీపీ

చేవెళ్ల: తలకొండపల్లి తహసీల్దార్ వెంకటరంగారెడ్డిపై కిడ్నాప్ కేసు నమోదైంది. మోకిల ఠాణా పరిధిలో ఐదు నెలల క్రితం నమోదైన ఓ కిడ్నాప్ కేసు విచారణలో తహసీల్దార్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించి ఆయన అరెస్ట్‌కు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిపై నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌ను వివరణ కోరగా ఇది పాత కేసు అప్పుడే కేసులు నమోదయ్యాయి. దీనిని ఇప్పుడు ఎవరో వైరల్ చేశారంటూ చెప్పారు.

ఏ-10గా ఏసీపీ

తలకొండపల్లి మండలంలోని చంద్రదన గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రీనివాస్‌రాజుకు 50 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై అదే గ్రామానికి చెందిన సూర్యనారాయణరాజు కన్నేసి కాజేసేందుకు ప్లాన్ వేసుకున్నాడు. 2023 నవంబర్ 15న శ్రీనివాస్‌రాజు తన చిన్న కుమారుడిని శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ పరిధిలో ఉన్న ఓ పాఠశాలలో దింపేందుకు వచ్చాడు. ఆయన తిరిగి ఇంటికి వెళ్తుండగా సూర్యనారాయణరాజుకు చెందిన ముఠా వెంబడించి కొండకల్ తండా వద్ద దాడి చేసి కిడ్నాప్ చేశారు. ఆయన భార్య సుశీలతో ఫోన్ మాట్లాడుతుండగా లాక్కొని స్విచ్ఛాఫ్ చేశారు. వెంటనే ఆమె సుబ్బరాజుకు విషయం చెప్పడంతో ఆయన 100కు ఫోన్ చేసి మోకిల ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు సూర్యనారాయణరాజు, రుద్రరాజు, బలరామరాజు, టి.ఉపేందర్‌రెడ్డి, హరికృష్ణ కుమార్, నీలం లక్ష్మీనారాయణ, గోపిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో మరికొంత మంది నిందితులున్నట్లు గుర్తించిన పోలీసులకు హైదరాబాద్ కమిషనరేట్‌లో పనిచేసే ఏసీపీ చాంద్‌పాషా హస్తం ఉన్నట్లుగా బయటపడగా ఎ-10గా కేసు నమోదు చేశారు. ఆయన వెంటనే హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తీసుకున్నట్లు సమాచారం. ఈకేసులో తలకొండపల్లి తహసీల్దార్ వెంకటరంగారెడ్డి ప్రమేయం ఉన్నట్లు తెలియడంతో కిడ్నాప్ కేసు నమోదయింది.

ఎన్నికల విధుల నుంచి వచ్చి రిజిస్ట్రేషన్

శ్రీనివాస్‌రాజును మోకిల ఠాణా పరిధిలో సూర్యనారాయణరాజు ముఠా కిడ్నాప్ చేసింది. 24 గంటల తర్వాత ఆయన్ను బలవంతంగా తహసీల్దార్ కార్యాలయాలనికి తీసుకువచ్చి పాస్‌బుక్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లేకుండానే తదితర ఆధారాలు ఏవీ లేకుండానే 30 ఎకరాల భూమిని సూర్యనారాయణరాజు పేరిట రిజిస్టేషన్ చేయించుకున్నారు. ఈ భూమి రిజిస్ట్రేషన్ చేసిన రోజు నవంబర్ 16న మరో 12 స్లాట్‌లు బుక్ చేయగా తహసీల్దార్ ఈ ఒక్క భూమి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముందుగానే రూ.పది లక్షలకు ఒప్పందం చేసుకున్న ఆయన కల్వకుర్తిలో ఎన్నికల విధుల్లో ఉన్న ఆయన తలకొండపల్లికి వచ్చి శ్రీనివాస్‌రాజుకు గాయలున్నప్పటికీ ఎటువంటి ఆధారాలు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి తిరిగి విధులకు వెళ్లినట్లు విచారణలో వెల్లడయింది. తహసీల్దార్‌కు కిడ్నాప్ కేసుతో సంబంధం ఉన్నట్లుగా నిర్ధారణకు వచ్చిన మోకిల పోలీసులు ఆయన అరెస్ట్‌కు రంగం సిద్ధం చేస్తున్నారు. చట్టప్రకారం మెజిస్ట్రేట్ హోదా ఉన్న తహసీల్దార్‌ను నేరుగా అరెస్ట్ చేయటం కుదరనందున చట్ట ప్రకారం రూల్స్‌ను పోలీసులు పాటించి ముందస్తు 41 ఏసీఆర్‌పీసీ నోటీసులు జారీ చేసి అరెస్ట్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజేఎఫ్ సంఘం నాయకులు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మీడియాను పూర్తిగా విస్మరించాయని.. ఇళ్ల స్థలాల కోసం పోరాడినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కృషితో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చాయన్నారు. షాద్‌నగర్‌లోనూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రెస్ అకాడమీ చైర్మన్ నియమించిందని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని త్వరలో తీపికబురు అందుతుందన్నారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో జర్నలిస్టు సంఘం నాయకులు నర్సింహారెడ్డి, మల్లేశ్, నరేశ్, శీనయ్య, మల్లేశ్, రమేశ్ తదితరులున్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ

గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఘర్షణకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. బుధవారం అర్ధరాత్రి తర్వాత రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు పరస్పర దాడులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఇరు వర్గాలకు చెందిన బాలకృష్ణ, హఫీజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

సర్వే చేయించి సాయం చేయాలి

యాచారం: భూగర్భజలాలు తగ్గుముఖంపట్టి వందలాది ఎకరాల్లో వరి, కూరగాయలు, పండ్లతోటలు ఎండిపోయాయని, తక్షణమే రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఎండిపోయిన పంటలను వెంటనే వ్యవసాయాధికారులు సర్వే చేయాలని కోరారు. ప్రభుత్వం రైతుబంధు పథకం కింద నిధు లు రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడంతో పంటల సాగు పెట్టుబడికి అప్పులు చేశారని.. నేడు పంటలు సైతం ఎండిపోవడంతో రైతులు అప్పులపాలయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వ్యవసాయాధికారులతో సర్వే చేయించి ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందజేసేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతాంగం గుణపాఠం చెబుతారన్నారు.

అప్రమత్తతతోనే అడ్డుకట్ట



ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



గ్యాస్ సిలిండర్ పరిశ్రమలో..

అగ్నిప్రమాదాల నివారణకు వారోత్సవాలు

- అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్స్
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

షాద్‌నగర్: వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే ఆస్కారం ఉంటోంది. వీటి నివారణకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

ముంబాయి ప్రమాదానికి గుర్తుగా..

ప్రతి ఏడాది ఏప్రిల్ 14న జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా వారోత్సవాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. 1944 ఏప్రిల్ 14న ముంబాయిలోని విక్టోరియా డాక్ యార్డులో అగ్ని ప్రమాదం జరిగి ఎంతో మంది అగ్నిమాపక సిబ్బందితో పాటుగా, ప్రజలు మృత్యువాత పడ్డారు. దీంతో స్మారకార్థం ప్రభుత్వం జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రతీ ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20 వరకు వారోత్సవాలను నిర్వహిస్తుంటారు.

46 ప్రమాదాలు

షాద్‌నగర్ ప్రాంతంలో భారీ, మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలు సుమారు వందకు పైగా ఉన్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతంలో తరుచుగా ఏదో ఓ చోట అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఇటీవల షాద్‌నగర్‌లో రంగుల తయారీ పరిశ్రమలో, కొందుర్గులో ఐరన్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలు సంభవించి లక్షల్లో నష్టం వాటిల్లడంతో పాటు ప్రాణ నష్టం జరిగింది. ఈ ప్రాంతంలో క్వారీ గుంతలు సైతం అధికంగా ఉన్నాయి. వీటిని పూడ్చకపోవడంతో వాటిలో పడి ఎంతో మంది మృత్యువాత పడ్డారు. రహదారుల పై ఇటీవల కాలంలో రెండు కార్లలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. పలుచోట్ల గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇటీవల షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి అందిన 46 ఫిర్యాదులకు అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టారు.


ప్రమాదాల కారణాలు

- కాల్చిపడేసే సిగరెట్, బీడీ పీకలను నిర్లక్ష్యంగా ఆర్పకుండా పడేయడం
- గ్యాస్, కిరోసిన్ స్టవ్ వాడే సమయంలో జాగ్రత్తలు పాటించకపోవడం
- నాణ్యతలేని విద్యుత్ ఉపకరణాలు, పరికరాలు ఉపయోగించడం
- రోడ్డు పక్కన చెత్తకుప్పలకు నిప్పంటించడం

విస్తృతంగా అవగాహన

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ రాజు నేతృత్వంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అగ్నిప్రమాదాల సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు ఎలా తీసుకోవాలి, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు అపార్టుమెంట్లల్లో, పరిశ్రమల్లో, పాఠశాలలు, కళాశాలల్లో, పెట్రోల్ బంకులు తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక వేళ ప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. ప్రజలకు అత్యవసర సేవలు అందించడంలో అగ్నిమాపక విభాగం ముందుంటుంది.

– జగన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, షాద్‌నగర్